క్లుప్తంగా

నాలుగో బ్యాచ్ జెడ్పీటీసీలకు శిక్షణ ప్రారంభం



శిక్షణలో మాట్లాడుతున్న ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: పాలనా నైపుణ్యంపై జెడ్పీటీసీ సభ్యులకు ఇస్తున్న శిక్షణ నాలుగో బ్యాచ్ విజ్ఞానదాయకంగా సాగుతోంది. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ తరగతులు ప్రారంభిస్తూ జిల్లా పరిషత్ అమలుచేసే వివిధ కార్యక్రమాలను అమలు చేసే నైపుణ్యం ఈ శిక్షణతో వస్తుందని అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడి నుంచి మంత్రిగా ఎదిగిన ప్రస్తుత పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అంతా ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్, కేఎస్సార్ నిహరిక, ఎంఎస్ఎన్ రెడ్డి మొదటి రోజు శిక్షణ ఇచ్చారు.

మున్సిపాలిటీకి 8 ఈ-ఆటోలు



సామర్లకోటకు వచ్చిన ఈ-ఆటోలను పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

సామర్లకోట: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా సామర్లకోట మున్సిపాలిటీకి సోమవారం 8 ఈ-ఆటోలు వచ్చాయి. వాటిని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, ఏఈ అరవింద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావులు పరిశీలించారు. రాష్ట్రాన్ని క్లీన్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న దృఢ సంకల్పంతో, పర్యావరణ హితంగా ఉంటూ చిన్న మున్సిపాలిటీలపై నిర్వహణ భారం తగ్గేలా ఈ-ఆటోలను మున్సిపాలిటీలకు కేటాయించారు. పట్టణ పరిధిలో 31 వార్డులు ఉండగా ఏయే వార్డులకు ఈ ఆటోలు కేటాయించాలన్న విషయంపై కౌన్సిల్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.


పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు తొలి పూజ చేసి అనంతరం భక్తుల పూజలను చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం తరపున అన్నదానం ఏర్పాటు చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. పూజల అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలోని ఉప ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు.

కరాటేలో పీసీసీ విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ చూపి బహుమతులు అందుకుంటున్న పీసీసీ విద్యార్థులు

పెద్దాపురం: విశాఖపట్టణంలో నిర్వహించిన అమరపిని శ్రీనివాసరావు మెమోరియల్ రెండో నేషనల్ కరాటే ఓపెన్ ఛాంపియన్ షిప్-2023 పోటీల్లో పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్, అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్ సోమవారం స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఉచిత వేసవి శిక్షణ పొందిన 11 మంది విద్యార్థులు కరాటే పోటీల్లో తలపడగా, ఇద్దరికి బంగారు పతకాలు, ఇద్దరికి వెండి పతకాలు, ఐదుగురికి కాంస్య పతకాలు వచ్చాయన్నారు.

చెరువు అభివృద్ధి పనుల పరిశీలన

కొత్తపల్లి: చెరువుల అభివృద్ధి గ్రామస్తులకు ఎంతో ఉపయోగకరమని ఎంపీపీ కారే సుధ అన్నారు. వాకతిప్ప మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న చెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ చెరువు అభివృద్ధి చేసేందుకు గట్టుపై వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు పార్కు ఏర్పాటు చేసేందుకే ఎంపీపీ నిధులు రూ.3లక్షలను కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పాలాని దొరబాబు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు ఉన్నారు.

మృత్యు మలుపులు



గోర్స- పండూరు రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మలుపు



నాగులాపల్లి- ఇసకపల్లి రోడ్డులో మరో మలుపు

- రహదారుల్లో మలుపులు ప్రమాదకరం
- హెచ్చరిక బోర్డులు కరువు
- పట్టించుకోని అధికారులు

కొత్తపల్లి: రహదారుల్లో మలుపులు ప్రమాదకరంగా మారాయి. మండలంలో వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లలోని మలుపుల వద్ద తుప్పలు పెరిగిపోవడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఎందరో ప్రాణాలను కోల్పోయారు. పలువురు గాయాలపాలయ్యారు. నిత్యం ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రమాదకర మలుపులివే..

మండల పరిధిలోని ఆయా గ్రామాలకు వెళ్లే కొమరగిరి-ఆనందనగర్, గోర్స-నాగంపేట, పండూరు-కొత్తపల్లి రోడ్డులో మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఇక్కడ ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారిలో వెళ్లాలంటే వాహన ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రమాదాలు నియంత్రించే దిశగా రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలు మంజూరు చేస్తోంది. కానీ ఆర్‌అండ్ బీ అధికారులు మలుపులు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. ప్రతినిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మలుపులు వద్ద సూచికల బోర్డులను ఏర్పాటు చేసి ప్రమదాల నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రయాణం అంటే భయపడుతున్నాం

మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి వేళల్లో ఈ రహదారుల్లో వెళ్లాలంటే భయపడుతున్నాం. పండూరు - కొత్తపల్లి రోడ్డులో కొమరగిరి శివారు వెంకటరాయపురం సమీపంలో ఉన్న కాలువలో వాహన చోదకులు పడి క్షతగాత్రులవుతున్నారు. ఇటీవల ఒక వ్యక్తి మృతి చెందాడు. గోర్స భద్రుని చెరువు వద్ద ఉన్న మలుపులో అనేక ప్రమాదాలు జరిగాయి. అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. - రొంగల వీరబాబు, గోర్స సర్పంచి

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం

ప్రమాదకరంగా ఉన్న మలుపుల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. ప్రమాదకరంగా ఉన్న కల్వర్టులకు మరమ్మతులు చేస్తాం. రోడ్డు మరమ్మతులు నిమిత్తం ఎస్టిమేషన్ వేసి పంపించాం. నిధులు వస్తే పనులు ప్రారంభిస్తాం.
- పి.నాయుడు, ఆర్‌అండ్‌బీ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్, పిఠాపురం

మోగిన బడి గంట

- కదిలిన విద్యార్థులు
- కళకళలాడిన పాఠశాలలు



కొత్త పుస్తకాలు తీసుకుని పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న విద్యార్థులు

పిఠాపురం: వేసవి సెలవుల విరామం తర్వాత బడులు తెరుచుకున్నాయి. బుడిబుడి నడకలతో వడివడిగా అడుగులు వేస్తూ విద్యార్థులు కదిలారు. కలర్‌ఫుల్ క్లాసులు స్వాగతం పలకగా నాడు-నేడు పనులతో అధునాతన సౌకర్యాల నడుమ విద్యార్థులతో ప్రభుత్వ పాఠశాలలు కళకళలాడాయి. ప్రభుత్వం అందజేసిన యూనిఫాంలో కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా రూపుదిద్దుకున్న పాఠశాలలకు విద్యార్థులు పరుగులు తీశారు. పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో జాయిన్ చేయడానికి ముందడుగులు వేశారు. ఎక్కడ చూసినా ప్రభుత్వ పాఠశాలలు కొత్త కళను సంతరించుకున్నాయి. కొత్త పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభించిన ఉపాధ్యాయులు తరగతులను ఆనందోత్సాహాల మధ్య ప్రారంభించారు. తొలి రోజు సోమవారం కావడంతో పాటు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో మందకొడిగానే విద్యార్థులు హాజరు అయినప్పటికి ఉపాధ్యాయులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడంతో ఉత్సాహభరితంగా సాగింది. విద్యార్థులు తరగతులకు హాజరుకావడంతో పాటు మధ్యాహ్న భోజనాలను చేశారు.

ఇంటర్ మహిళా కళాశాల ప్రారంభం



ఇంటర్ మహిళా కళాశాలను ప్రారంభించిన ఎంపీపీ సుధతో సిబ్బంది

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో జిల్లా పరిషత్ పాఠశాలలో ఇంటర్మీడియెట్ విద్యను అందుబాటులోకి తెచ్చిందని ఎంపీపీ కారే సుధ అన్నారు. మూలపేటలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం ఇంటర్ మహిళా కళాశాలను ఆమె ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ చదువును అర్ధాంతరంగా నిలిపివేయకుండా ఈ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ కళాశాల ప్రారంభం మొదటి సంవత్సరానికి సంబంధించి మాత్రమే తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే ఏడాది నుంచి రెండు సంవత్సరాలకు సంబంధించి తరగతులు నిర్వహిస్తారు. ఇప్పటికే ఎంపీసీ 18, బైపీసీకి సంబంధించి 35 మంది విద్యార్థినులు చేరారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కంబాల మౌనిక, ఎంపీటీసీ అడ్డా పాప, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

విద్యావ్యవస్థ రూపురేఖలు మార్చిన సీఎం జగన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

పిఠాపురం: టీడీపీ హయాంలో అట్టడుగు స్థానానికి పడిపోయిన విద్యా వ్యవస్థకు సమూలమైన మార్పులు చేసి విద్యకు అధిక ప్రాధాన్యతనివ్వడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు కార్పొరేట్ విద్యను అందుకునేలా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చేశారన్నారు. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు పేరుతో అభివృద్ధి చేశారన్నారు. పేదలకు ఉన్నత విద్య అందించాలన్న దృక్పథంతో అనేక పథకాలు అమలు చేస్తూ తల్లిదండ్రులపై భారం పడకుండా విద్యకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తు పేదలందరికీ విద్య అందేలా చేస్తున్నారన్నారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, గంద్రేటి శ్రీరామచంద్రమూరి, జ్యోతుల భీముడు, అరిగెల రామయ్యదొర, మొగలి అయ్యారావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

విద్యకు అధిక ప్రాధాన్యం

పెద్దాపురం: విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని కాండ్రకోట జెడ్పీ హైస్కూల్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై సోమవారం జగనన్న విద్యాదీవెన కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో దొరబాబు మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందిస్తూ కార్పొరేట్ పాఠశాలలకు తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలలను నిర్వహిస్తున్న ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించాలని దొరబాబు సూచించారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, గుడివాడ సర్పంచ్ కనపర్తి చీమదొర తదితరులు పాల్గొన్నారు. అనంతరం చదలాడలో నిర్వహించిన ప్రసన్నాంజనేయ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని భారీ అన్నదానాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్ ఓబిలిశెట్టి అబ్బాయి, ఎంపీటీసీ శైల గణేష్, ఓబిలిశెట్టి ఆనందం, దేవన శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.



కాండ్రకోటలో జేవీకే కిట్‌ను విద్యార్థినికి అందజేస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

విద్యా రంగానికి పెద్దపీట

కొత్తపల్లి: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు చదువులో రాణించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష.. అందుకు విద్యారంగంలో విప్లవానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ కారే సుధ అన్నారు. మండలంలోని మూలపేట, వాకతిప్పలో ఉన్న జిల్లా పరిషత్, వాకతిప్పలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందించారు. విద్యతోనే పేదరికం దూరమవుతుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదింట్లో విద్యాదీపాలు వెలగాలన్నదే సీఎం ప్రధాన లక్ష్యమన్నారు. మండలంలో 8105 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు పాలని దొరబాబు, కంబాల మౌనిక, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాస్, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, ఎంపీటీసీ గోగు లోవకుమారి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు మంచి మార్కులు కానుకగా ఇవ్వండి

సామర్లకోట: విద్యార్థులు చక్కగా చదివి మంచి మార్కులు సాధించి జగనన్నకు కానుకగా ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ పిలుపునిచ్చారు. స్థానిక బుచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు జగనన్న విద్యా కానులకు పంపిణీ చేశారు. జగనన్న విద్యాకానుక, అమ్మఒడి పథకం ద్వారా రూ.15 వేలు ఇస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని జీవిత కాల ముఖ్యమంత్రిగా ఉండేలా విద్యార్థులు వారి వారి తల్లిదండ్రులకు సూచించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ జె రామారావు మాట్లాడుతూ మున్సిపాలిటీ నుంచి అవసరమైన సదుపాయాలను పాఠశాలలకు అందజేస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్ బలుసు వాసు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వాకతిప్పలో విద్యాకానుక కిట్ అందిస్తున్న ఎంపీపీ సుధ



సామర్లకోట బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో జగనన్న విద్యాకానుక కిట్లు అందజేసిన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ తదితరులు

డివిజన్ స్థాయి స్పందనకు 8 అర్జీలు

డీఎల్‌డీఓ ప్రసాద్



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న డీఎల్‌డీఓ ప్రసాద్

పెద్దాపురం: డివిజన్ స్థాయి స్పందనకు సోమవారం ఆయా మండలాల నుంచి ఎనిమిది అర్జీలు అందినట్లు డీఎల్‌డీఓ కేఎస్‌వీవీ ప్రసాద్ తెలిపారు. భూతగాదా పరిష్కరించాలని, ఆక్రమణలు తొలగించాలని, తమ భూమికి పట్టాదారు పాస్ పుస్తకం కావాలని, భూ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని ఎనిమిది ఫిర్యాదులు అందినట్లు డీఎల్‌డీఓ వెల్లడించారు. అనంతరం ఆయన ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతితో కలసి స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం స్పందన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. డీఎల్‌పీఓ బాలామణి, డీటీ భానుకుమార్, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ దైవకుమార్, రవిశంకర్, ప్రసాద్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం



ఫ్లైఓవర్‌పై స్తంభించిన ట్రాఫిక్



ట్యాంకరును క్రేన్‌తో తరలిస్తున్న పోలీసులు

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై సోమవారం సాయంత్రం సాంకేతిక లోపంతో ఆయిల్ ట్యాంకరు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు సిబ్బందితో క్రేన్ సాయంతో ట్యాంకర్‌ను తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

పెద్దాపురం: జిల్లా పునర్విభజనతో పరిపాలన సౌలభ్యం సాధ్యపడుతుందని, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని తొలి ఎంపీడీఓగా నియమితులైన బత్తిన అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా కొనసాగిన హిమమహేశ్వరి పదోన్నతిపై అనపర్తి ఎంపీడీఓగా వెళ్లారు. 2007 గ్రూప్-1కు ఎంపికైన అశోక్‌కుమార్ ఈఓపీఆర్డీగా బిక్కవోలు, రాయవరం మండలాల్లో సేవలందించారు. అక్కడ నుంచి వై.రామవరం, మారేడుమిల్లి ఇన్‌చార్జి ఎంపీడీఓగా విధులు నిర్వహించి తాజాగా పెద్దాపురం ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ప్రతి అర్జీని పరిష్కరించాలని, గ్రామీణ పాలనపై శ్రద్ధచూపి అంకితభావంతో పనిచేయాలని, సిబ్బందితో కలసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన తెలిపారు. తొలుత ఆయన రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతిలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్‌డీ మూర్తితో కలసి పలు అంశాలపై సమీక్షించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.



ఎంపీడీఓ అశోక్‌కుమార్‌ను అభినందిస్తున్న అధికారులు, పంచాయతీ కార్యదర్శులు

స్టేషన్‌మాస్టర్‌ల సేవలు అభినందనీయం

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్లు యుఎస్ శ్రీకాంత్, కె.శంకరరావు ఉత్తమ సేవలు అందించారని స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో భాగంగా శ్రీకాంత్ కాకినాడ పోర్టు స్టేషన్ మాస్టర్‌గా, కె.శంకరరావు రాజమహేంద్రవరం స్టేషన్ మాస్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం వారిని అభినందించి, వారి సేవలను కొనియాడారు.



బదిలీ అయిన ఉద్యోగులను సత్కరించిన స్టేషన్ మేనేజరు, స్టేషన్ మాస్టర్లు

బీమా అందజేత

కొత్తపల్లి: ఉప్పాడ శివారు రామిశెట్టిపేటకు చెందిన పరమళ్ల లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. సోమవారం ఆమె కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అందించిన వైఎస్సార్ బీమా మొదటి విడత రూ.10వేలను మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్ అదజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ నాయకులు ఏరిపల్లి రాంబాబు, సచివాలయ సిబ్బంది ఉష పాల్గొన్నారు.



లక్ష్మి కుటుంబానికి వైఎస్సార్ బీమా సొమ్మును అందిస్తున్న దృశ్యం

వ్యవసాయానికి ప్రాధాన్యమిస్తున్న ప్రధాని మోదీ

కేంద్ర మంత్రి వెల్లంవెల్లి మురళీధరన్

పిఠాపురం: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వ్యవసాయానికి ప్రాధాన్యమిస్తున్నారని, రైతులకు మేలు చేసే పథకాలు అమలు చేస్తున్నారని కేంద్ర విదేశాంగ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వెల్లంవెల్లి మురళీధరన్ అన్నారు. ఆయన సోమవారం ఎఫ్‌కే పాలెం పాపిడిదొడ్డి చెరువులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెల్లంవెల్లి మాట్లాడుతూ నిరుపేద ప్రజల అభ్యున్నతికి కేంద్రం ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందన్నారు. భారత స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ గ్రామాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా ప్రతి జిల్లాలో 75 చెరువులను అమృత సరోవర్ పేరుతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే పలు చెరువులు అభివృద్ధి చేశామని, మరిన్ని పనులు చేపడతామని తెలిపారు. గ్రామీణాభివృద్ధిలో భాగంగా ఉపాధి హామీ పథకాన్ని మరింత పటిష్టంగా నిర్వహిస్తున్నామన్నారు. పేదలకు పని దినాలను పెంచి అందరికి జీవనభృతి కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన అమృత సరోవర్ పథకంలో అభివృద్ధి చేస్తున్న ఎఫ్‌కే పాలెం పాపిడిదొడ్డి చెరువును పరిశీలించి అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, బీజేపీ నేతలు ఉన్నారు.



చెరువు పనులను పరిశీలిస్తున్న కేంద్ర విదేశాంగ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వెల్లంవెల్లి మురళీధరన్

పథకాల అమలులో వలంటీర్లే కీలకం

- హౌసింగ్ చైర్మన్ దవులూరి దొరబాబు
- సేవా పురస్కారాలు అందజేత

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని కాండ్రకోటలో సర్పంచ్ మాకినీడి శ్రీనివాస్ అధ్యక్షతన వలంటీర్లకు సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన దొరబాబు వలంటీర్లు సేవా సైనికులను అన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ఫలాలను చేరవేయాలనే లక్ష్యంతో సీఎం జగన్ ఈ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళితో కలిసి తాటిపర్తి, చంద్రమాంపల్లి గ్రామ సచివాలయ వలంటీర్లకు శాలువాలు కప్పి, ప్రశంసాపత్రాలు, మెడల్స్‌తో సత్కరించారు. తాటిపర్తి గ్రామంలో మంజూరైన 33 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను దొరబాబు అందజేశారు. గుడివాడ సర్పంచ్ కనపర్తి చీమదొర, సుందరెడ్డి రాజు, లక్కాకుల కృష్ణ, ఇదుసుమల్ల సాయి తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్లను సత్కరిస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు